త్రీ - నోస్

కాస్మాపాలిటన్ క్లబ్బులో టేబుల్ ముందు కూచుని 'త్రీ హార్ట్సు' 'బిడ్ 'త్రీ నోస్' అంటూ వుండగా, ఆఫీసు కుర్రాడు చిన్న చీటీ పట్టుకొచ్చి వినమ్రంగా నుంచున్నాడు.

నేను 'త్రీ-నోస్' అనేశాను. తరువాత వాళ్ళు 'పాస్' అన్నారు ఆడవలసి నాయన ముక్క దిగాడు. నా పార్టనర్ ముక్కలు పరిచాడు.

ఆఫీసు కుర్రాడు : 'సార్, అర్జంట్ ఫోన్ మెస్సేజి, సార్!'' అంటూ భక్తి వినయాలతో చీటీ చేతి కందిచ్చాడు.

చీటీ విప్పిచూసుకునేటప్పటికి ప్రపంచం కూలిపోయిన ట్లనిపించింది. మనసు పరిపరివిధాల పోయింది. అందులో ఉన్నవి రెండే ముక్కలయినప్పటికి ఆ రెండూ . బాంబ్ షెల్స్. ''శివశంకరమ్ తెల్లారినప్పట్నుంచీ కనిపించడం లేదు. ఏం చెయ్యాలో తోచడం లేదు—కిరణ్మయి.''

ముఖంలో వేదన కనిపించకుండా, అగ్నిపర్వతపు భుగ భుగలు గుండెల్లో ఉన్నప్పటికీ పైకి ఒక్క చిరునవ్వు విసిరి, తొందర పనిమీద వెళ్ళాలంటూ నా 'హాండ్' మరొకరికి వొప్పజెప్పాను.

క్లబ్బునుంచి కిరణ్మయి యింటికి వెళ్ళేందుకు, ఎంత లేదన్నా పదిహేను నిముషాలు పడుతుంది. ఈ కాసేపట్లో ఎన్నెన్నో

ఆలోచనలు తరుముకు వచ్చాయి. శివశంకరానికి యాక్సిడెం టేమీ జరగలేదు గదా! ఏ కారుకిందనో, ఎలక్ట్రిక్ ట్రెయిన్ కిందనో పడలేదుగద! ప్రమాదాలు చెప్పి రావు. డ్రయివర్ల అజాగ్రత్తవల్ల రోడ్డు ప్రమాదాల సంఖ్య దిన దినానికీ పెరుగుతోంది. యాక్సిడెం టయితే కిరణ్మయికి ఎందుకు తెలియదు? యాక్సిడెంటనే చెబుతుందిగా మెస్సేజిలో.

భార్యా భర్త లిద్దరూ తగవు లాడుకున్నారా? వడ్ల గింజలో బియ్యపుగింజలా, అడపా దడపా వారు ఏమయినా మాటలు అనుకున్నప్పటికీ, యిద్దరి మధ్యా అంత తీవ్రమైన అభిప్రాయభేదా లంటూ లేవు. పామూ ముంగిసలా పట్టు బట్టరు. పట్టూ విడుపూ పదిహేనేళ్ళ దాంపత్యంలో వారికి బాగా వొంటబట్టింది. శివశంకరమ్‌గాని ఒక వేళ తను పట్టిన కుందేలుకి మూడేకాళ్ళు అంటే, అవు నని కిరణ్మయి ఎంత చక్కగా తల వూపేది! అలాగే కిరణ్మయిగాని మూతి బిడాయించుకు కూచుంటే, ఆమెని మాట్లాడించిగాని శివ శంకరమ్ మరొక పని తలపెట్టేవాడు కాదు. వారు ఆదర్శ దంపతులో, చిలకా గోరువంకలో నేను చెప్పలేను గాని, వారి సంసారంలో క్షీరోదక న్యాయం కనిపించేది.

శివశంకరానిదీ నాదీ ఈనాటి పరిచయమా? కాలేజీ రోజుల్లోనుంచీ యిద్దరం ఒకరికొకరం బాగా తెలుసు. మధ్య మధ్య ఉద్యోగరీత్యా ఏడాదీ రెండేళ్ళూ దూరంగా ఉంటు

న్నప్పటికీ మళ్ళీ కలుసుకుపోయేవాళ్ళం. 24 వ ఏట కాబోలు అతను రావ్ అండ్ శర్మా లిమిటెడ్‌లో ఒక చిన్న గుమా స్తాగా చేరాడు—ఆ చేరడం కూడా నా ప్రోద్బలం మీదనే చేరాడు. జమీందారు దగ్గర తాణేదారు గిరీకంటె పెద్ద పట్నంలో చిన్నదంపని ఉద్యోగం ఉత్తమమని అతనికి మన స్ఫూర్తిగా నచ్చింది. ఉద్యోగంలో చేరిన ఏడాదిన్నరకి కిరణ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. కిరణ్మాయి అసలుపేరు సుభద్ర. వివాహానంతరం శివశంకరమే సుభద్రని కిరణ్మా యిగా మార్చాడు. ఆనాటి పెళ్ళిపెద్దలలో నేను కూడా ఒకణ్ణి. తెలుగు బాగా వచ్చినప్పటికీ కిరణ్మాయి కన్నడ దేశస్థుల పిల్ల. కిరణ్మాయి అన్నగారు కూడా అదే ఆఫీసులో పనిచేస్తూ వుండేవాడు. ఆమె అప్పటికి స్కూల్ఫైనల్ చదువుతూ వుండేది.

కిరణ్మాయికీ శివశంకరానికీ మనసూ మనసూ కలిశాయి. పిల్ల తరపువారికి అభ్యంతర మేమీ లేకపోయింది గాని శివశంకరమ్ తండ్రివచ్చి, పెద్ద ఆర్భాటం చేసి వెళ్ళాడు. ఏమయితేనేం, కొందరు మిత్రులం పూనుకుని, వారిద్దరికీ వివాహం జరిపించాము. కాలక్రమేణా వారికి ఒక అబ్బాయీ, ఒక అమ్మాయీ కలిగారు.

శివశంకరమ్ చిన్న గుమాస్తానుంచి సెక్షన్ హెడ్ అయాడు; కొన్నాళ్ళతన్ని సూపర్ వైజర్ అని పిలిచేవారు; తరువాత ఏదో దూరపు బ్రాంచికి మేనేజరు చేశారు;

ప్రస్తుతం హెడ్ ఆఫీస్‌లో అసిస్టెంట్ మేనేజరుగా ఉన్నాడు. నాకు మల్లే నాలుగు రకాల ఉద్యోగాలు చేసి, నాలుగురకాల వ్యాపారాలలో చేతులు కాల్చుకోక, ఏదో తిన్నగా, ముక్కుకు సూటిగా జీవితాన్ని గడుపుతున్నాడు. మొన్న ఆగస్టునాటికి అతనికి 42 వచ్చాయి. నాకు పుట్టిన పండగేమిటని అతను గునవడమూ, చేసితీరతానని కిరణ్మయి పట్టు పట్టడమూ, యిద్దరి తగవూ నేను తీర్చడమూ, నిన్నగాక మొన్న జరిగినట్లుంది.

స్వంత లాభాలకోసమూ, స్వప్రయోజనాలకోసమూ మాత్రమే స్నేహాలు ఏర్పడే ఈ రోజుల్లో, నేనూ శివశంకరమూ మా ఆత్మీయతను తలుచుకు గర్వపడేవాళ్ళము. రెండు దశలు పైగా గడిచింది. ఇద్దరి మధ్యా ఉన్న స్నేహబంధం ఏమాత్రం సడలలేదు. కిరణ్మయి అతనికి సహధర్మచారిణి అయితే, నాకు ఆత్మబంధువు. ఆమె భర్తమీద అలిగిన సందర్భాలు ఎన్నో వున్నాయి; కాని నా మాట ఏనాడూ కాదనేది కాదు. ఒకవేళ నా సలహా తాత్కాలికంగా రుచించకపోయినా, పగరూ చేదూ కూడా వొంటికి మంచిదే అన్న విశ్వాసంతో నేను చెప్పినట్లు చేసేది.

"శివశంకరమ్ లేకపోతే కిరణ్మయి జీవితం ఏమిగాను?"- ఈ ఆలోచనని ఎంత తొక్కిపెట్టినా, అది వెయ్యిగిలలతో పైకిలేచేది. హక్కులు గురించీ, అవకాశాలు గురించీ, ఆస్తులు గురించీ, స్త్రీలు ఆందోళన సలపవచ్చు,

ఎన్ని చెప్పినప్పటికీ స్త్రీలు స్త్రీలే. లత పాకేందుకూ, ఎదిగేందుకూ ఆధారం కావాలనేది లోకనీతి. లత ప్రూనుకు చుట్టుకోవడం సహజధర్మం. సంఘంలో కిరణ్మయి స్థానం శివశంకరం భార్యగా నిర్ణయమవుతోంది. ఆ శివశంకరం లేనప్పుడు ఆమెకు పూర్వపు గౌరవ మర్యాదలు ఎక్కడ నుంచి వస్తాయి? ఇది కొత్త సంగతి కాదు. తరతరాలుగా యుగయుగాలుగా జరుగుతున్నదే! కిరణ్మయీ, ఆమె యిద్దరు పిల్లలూ ఏమవుతారు? కొత్తగా కట్టించిన యింటిమీద యింకా మూడువేలు అప్పు ఉందన్నాడు శివశంకరం ఆమధ్య. కారుమీద మాత్రం అప్పూ సప్పూ లేదు.

ఒకటా? ఒకదానికీ మరొకదానికీ సంబంధం లేని ఆలోచనలు ఎన్నో వచ్చాయి. చడీ చప్పుడూ లేకుండా కారు యింటిముందు ఆపి, గేటు తెరుచుకు లోపలికి వెళ్ళాను. కిరణ్మయి తలలో ఎప్పటి మాదిరిగానే పూలు ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే తెల్లచీరె కట్టుకుని పాప్లిన్ జాకెట్టు వేసుకుంది. ఎప్పటి మాదిరిగానే సన్నని యుడికోలోన్ వాసన వచ్చింది.

అన్నం మానేసి, ఏడుస్తూ ఒకమూల కూచోదు కిరణ్మయి—అని నాకు తెలుసు. కాని యింత ధైర్యంతో ఉండగలదని అనుకోలేదు.

"ఏం జరిగింది?" అని అడిగాను.

"ఏముంది—ఒక ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోయారు ఏదో

ఆఫీసు పనిమీద కాంపుకి వెళ్ళారని పైన అద్దెకున్నవాళ్ళకు, పిల్లలకు చెప్పాను" అంది కిరణ్మయి.

ఇంటి పైభాగం అద్దెకిచ్చి, కింద వీళ్లు ఉంటున్నారు. మేడ అద్దె, జీతంలో కొంతా వేసి ప్రతినెలా ఈ యింటిమీద వున్న అప్పు తీర్చుకుంటూ వస్తున్నారు. నేనేదో అడగ బోతూ వుండగా, బడిలోనుంచి మధూ సుశీలా వచ్చారు. పిల్ల లిద్దరికీ హార్లిక్సూ, నాకూ అమ్మగారికీ టీ కలిపి పట్టు కొచ్చింది పనిమనిషి.

"టీ తీసుకోండి" అంది కిరణ్మయి. నా కేదో ధైర్యం చెబుతున్నట్లు. డైనమైట్ ఉన్న పెట్టెమీద కూచుని సిగ రెట్టు కాలుస్తున్నట్లుంది నా పరిస్థితి.

పిల్ల లిద్దర్నీ ప్లే గ్రవుండ్ దగ్గరికి తీసుకువెళ్ళమని పురమా యించింది పనిమనిషితో. వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, రేడియోకిందనుంచి ఒక ఉత్తరంతీసి నాచేతి కిచ్చింది.

"ఇప్పటి కొక యాభైసార్లు చదివి వుంటానేమో! మీరు నెమ్మదిగా పైకి చదవండి. ఇంకోసారి వినాలని వుంది."

ఉత్తరం పైకి చదివాను:

"దేవీ! అయిదారు నెలలబట్టీ నా మనసు ఎందుకో ఆవేదన పడుతోంది; దేనినో అందుకోవాలని తాపత్రయ పడుతోంది. పద్దెనిమిదేళ్ళు నౌకరీచేసి ఏదో శాస్త్ర సంపా దించాను. పిల్లలకు గ్రాహ్యం వస్తోంది. నువ్వు వ్యక్తిత్వాలివి. నాకు నీమీద ఏ కోపమూ లేదు, మా మేనేజరు యింట్లో

యోగానందస్వామిని చూసినప్పట్నుంచీ నాకు ఈ జీవితం మీద, ఈ ప్రలోభాలమీద విరక్తి ఏర్పడింది...అరిషడ్వర్గాలను జయించగలిగే సత్తువ నాలో లేకపోయినప్పటికీ, ధర్మార్థ కామమోక్షములలో మొదటి మూడూ అయిపోయినాయి కాబట్టి, నాలుగోది వెతుక్కునేందుకు నేను వెళ్ళిపోతున్నాను. నన్ను వెతక్కు. మీ వాళ్ళచేత వెతికించకు. నీకే సాయం కావలసినా సారథిని అడుగు. అతన్ని అడిగేందుకు సంశయించకు—శివశంకరమ్."

"అసలు కథేమిటి?"అని సూటిగా ప్రశ్నించాను కిరణ్మయిని.

"కథ అనేది ఒకటి ఉంటేగా నేను చెప్పేందుకు?"

"అతనిలో మార్పు ఏమైనా మీరు గమనించారా?"

"నేను కనిపెట్టేందుకు ఏ మార్పూ లేదు. నిన్న సాయంత్రం కూడా మామూలుగానే భోజనం చేశారు రాత్రి తమల పాకులు వేసుకున్నారు పడుకోబోయేటప్పుడు పాలు పుచ్చుకున్నారు."

"నిన్న మీరు మాట్లాడుకున్న మాటలు కాసిని చెప్పండి."

"పెద్ద పెద్దవిగాని, కొత్త కొత్తవిగాని ఏమీ మాట్లాడుకోలేదు. సుశీల స్కూల్లో జరిగే పేరెంట్స్ డేకి తప్పక వెళ్ళాలన్నారు. మధుకి కొత్త పెన్ను కొని పట్టుకొస్తానన్నారు. రాత్రి పాలు పుచ్చుకుంటూ ఒక్కమాట అన్నారు సుమండీ—

'పెళ్ళినాటి రాత్రి కూడా యిదే గ్లాసుతో పాలు తీసుకొచ్చి యిచ్చావుకదూ ?'—అని. ఎన్నో వెండి సామానులు మా పించాము; చెరిపించి చేయించాము—కాని ఆ గ్లాసుమట్టుకి అల్లాగే ఉంది. పిల్ల లెప్పుడూ ఆ గ్లాసు ముట్టుకోరు. ప మనిషి కూడా ఎంతో జాగర్తగా కడుగుతుంది. వెనక ఒక పనిమనిషి ఆ గ్లాసు కిందపడేస్తే, దానిని కొట్టాలన్నంత కోపం వచ్చింది.''

ఆ గ్లాసు మామూలు వెండిగ్లాసే ! కాని దానికి ఆ భార్యాభర్తలు యిచ్చుకున్న విలవ అపారం. అది పెళ్ళి బహుమానంగా కొని యిచ్చినవాడిని నేను. వ్యక్తులనుబట్టి వారు యిచ్చిన వస్తువుల మీద కూడా ఒకప్పుడు తీవ్రమైన మమకారం ఏర్పడుతుంది. నేను బహుమతిగా యిచ్చిన గ్లాసులో క్షీరం మాత్రమే పోసి, తనభర్త కొక్కడికే యిచ్చే కిరణ్మయి స్నేహశీలతమీద నాకు గౌరవం ఉండటంలో ఆశ్చర్యమేముంది ? అలవాటైపోయి కూడా కొన్నికొన్ని వస్తువులూ, ప్రవర్తనలూ తమ నిత్య నూతన పరిమళాన్ని పోగొట్టుకోవు. అలాంటిదే ఈ వెండిగ్లాసు మా ముగ్గురి మధ్యా.

''ఈ అనురాగాలు ఎలా ఛేదించుకో గలిగాడు శివశంక రమ్ ! నా కేదో అంతు చిక్కకుండా ఉంది. మొన్న ఆది వారం మీ యింటి కొచ్చినప్పుడు కూడా, వేసంగిలో తప్ప కుండా కొడైకెనాల్ వెళ్ళాలన్నాడు నాతో. అతని డ్రాయరు

తెరిచి, ఉత్తరాలూ అవీ చూడండి. ఏవైపుకి వెళ్ళాడో వివరాలైనా తెలుస్తాయి."

"వివరాలు తెలుసుకుందాము గాని ఆయన్ని వెనక్కి తీసుకొచ్చే ప్రయత్నం మనం చెయ్యవద్దు. నేనెంత చేసుకున్నానో, అంతా అనుభవించాలి గదా! ఆయన ముక్తి మార్గానికి నే నెందుకు అడ్డు తగలాలి? పిల్లలూ నేనూ బతకలేకపోము. ఏనాటికయినా ఆయన మనసుమళ్ళి, పెళ్లాం బిడ్డల్ని చూడామనుకుని వస్తారా, సంతోషం. లేదా, యింతే నాకు ప్రాప్తి—అనుకుంటాను."

"మీరు కూడా వైరాగ్యం మాట్లాడుతున్నారే!"

"వైరాగ్యంకాదు, సారథిగారూ! అంతకిమించి ఆడది ఏమి చెయ్యగలదు? ఏ మొహం పెట్టుకు నేను మా వాళ్ళ దగ్గరికి వెళ్ళేది? 'పుట్టినే సన్యాసుల్లో కలిసిపోతాడా. ఏదో కారణం ఉంటుంది—అని అందరూ అనరూ!" అంటూ భరింపరాని శోకంతో తల వొంచేసుకుంది. కన్నీళ్ళు జలజల రాలాయి, కిరణ్మయి తన రెండు చేతుల్లోనూ తల దాచుకుంది.

పదిహేనేళ్ళ మధ్యకాలంలో కిరణ్మయి కన్నీటి బొట్టు నేను ఏనాడూ చూడలేదు. నిండుకుండలాటి మని షామె; తొణకదు, బెణకదు. అలాంటి దీనాడు మనోధైర్యం లేక శోకభారంతో శిరసు వొంచుకుంది.

"చూడండి, కిరణ్మయీ, మీరు చిన్న పిల్ల కాదు. ఇద్దరు పిల్లల భావిజీవితానికి మీరు కర్తలు. శివశంకరం పిచ్చి శంకరం అయి బైరాగుల్లో కలిసిపోయినా, మీరు మీ జీవన మార్గం మరవకూడదు. పురుషు లందరిలోనూ ఆ బాధ్యతా రాహిత్యం కనిపిస్తుంది. కాని, స్త్రీ తన ధర్మాన్ని అనుష్ఠించ వలసిందే. మీకు మీ పిల్లలున్నారు! వాళ్ళని మానుష కలలు గంటూ, మీరు బతకాల్సిందే! మీరు స్త్రీలు. శివ శంకరంలా మీరు దులుపుకు పోలేరు."

కిరణ్మయి ఏడుస్తూవుంటే నా గుండె చెరువయింది. ప్రతి ఆదివారం వాళ్ళింట్లో భోజనం పెట్టేది నాకు. భోజనం పెట్టి అది తినిపించడం కూడా ఒక కళ. ఎంతో ఆప్యాయంగా వండి వడ్డించడంలోని ఆనందం స్త్రీలకే గాని పురుషులకు తెలియదు. కిరణ్మయిని అన్నపూర్ణ అనలేను; మోహినిలా అమృతం పెట్టిందనీ అనలేను; ఆమె చేతి అన్నంతింటే పంచ భక్ష్య పరమాన్నాలూ తిన్నట్టు వుండేది.

ఆ రుచి ఆమె చేసే వంటకాలలో ఉండేది కాదు; ఎన్నో సార్లు ఉప్పు వెయ్యడం మర్చిపోయేది; కొత్తరకం పిండి వంటలు మామీద ఎక్స్‌పెరిమెంటు చేసేది; కాని ఆ సౌరభం కిరణ్మయి హృదయంలో ఉండేది. ఆమెలాంటి దయాంతః కరణ గల స్త్రీ నాకెక్కడా కనిపించలేదు. శరత్ పుస్తకా లలో మాత్రం అలాంటిపాత్రల గురించి చదివాను; ఈ విహాలు భంగుల జీవితంలో కిరణ్మయిని చూశాను. కన్నడనాడులో

జన్మించి, మద్రాసులో పెరిగిన కిరణ్మయి సృష్టిలోని మాధుర్యానికీ లాలిత్యానికీ ఉదాహరణ.

ఆమెను ఊరుకోబెట్టాను. ప్లే గ్రవుండ్ నుంచి పిల్లలు వచ్చారు. ఏ విపత్తూ జరగనట్టు పెద్దవాళ్ళం ప్రవర్తించాము. ఆ రాత్రి భోజనాలవేళ, కన్నీళ్ళు బొటబొట రాలుతున్నప్పటికీ, పిల్లలకోసం నవ్వు తెప్పించుకు నవ్వే కిరణ్మయిని చూస్తే నా కడుపు తరుక్కుపోయింది.

శివశంకరం అభాగ్యుడా, నిర్భాగ్యుడా, దౌర్భాగ్యుడా? భార్యా పిల్లల్ని వొదిలేసిన పిచ్చి శంకరానికి సద్గతి ఏమిటి?- వాడి తలకాయ. బుర్రలో ఏదో పురుగు తిరుగుతూ వుండాలి. లేకపోతే యిలాంటి కమ్మటి సంసారాన్ని కాలదన్ని పోయేందుకు కాళ్ళు ఎలా వస్తాయి?

రెండుమూడు రోజులపాటు కిరణ్మయిని అంటిపెట్టుకునే వున్నాను కాని, లోకమొకటి ఏడిసిందిగా! శివశంకరం సన్యాసుల్లో కలిసిపోయాడనీ సారథి వాళ్ళింట్లోనే ఉంటున్నాడనీ ఆ నోటా ఆ నోటా పడితే, కథకి కావలసిన సమాచారం పూర్తి అవుతుంది; మా చుట్టూ వున్న మనుషులు నాలుగు నెలలపాటు నోళ్ళు నొక్కుకునేందుకు చక్కటి అవకాశం లభిస్తుంది. పెద్దకూతురుకు పెళ్ళిచేసిన నేనూ, భర్త ప్రస్తుతం పరారీ అయినప్పటికీ పదిహేనేళ్ళు కాపరం చేసిన కిరణ్మయీ లోకాపవాదానికి జడిసే స్థితిలో లేము. ఏమైనా, 'ముందేమిటి?' అని కొన్ని నిశ్చయాలకు రావాలిగదా!

“మీ రిక్కడే ఉండి, పిల్లలకి చక్కగా చదువు చెపించండి” అన్నాను.

"నేను యిక్కడ ఎందుకు? మా వాళ్ళింటికి వెళ్ళి పోతాను. ఇల్లు కిందభాగం కూడా అద్దెకి యిచ్చేస్తాను. అద్దె వసూలు చేయించి మీరు పంపిస్తారుగా!"

"మీ వాళ్ళింట్లో వుంటే, ఈ స్వతంత్రత, స్వేచ్ఛా ఉండవేమో మీకు! ఇన్నాళ్ళూ మీకు మీరుగా బతికి, ఈనాడు ఒకరింట్లో వొదిగి వుండగలరా?"

"మన యిష్టమేముంది—విధి నిర్ణయంగాని! రోజులు కలిసిరానప్పుడు తలవొంచుకుంటే సరి. ఆయన స్మృతి రాగుల్లో కలిసిపోవడం కంటె న్యూనత ఏముంది? నేను శాస్త్ర డబ్బున్నదాన్ని గనక మావాళ్ళు ఎలాగూ గౌరవిస్తారు. నా చెయ్యే పైన ఉంటుంది" అంది కిరణ్మయి. మన అమ్మాయి లకు మనం యింగ్లీషు చెప్పించినా, హిందీ చెప్పించినా వాళ్లు ఉండటానికి వీలయే స్థలాలు రెండే రెండు. అత్తారింట్లోనైనా ఉండాలి, పుట్టింట్లోనైనా ఉండాలి. మిగతా చోట్ల వారికి ప్రవేశం లేదు. పది రోజులు మరొకచోట వున్నా, పదకొండో రోజున వెళ్ళిపోవలసిందే!

విషయం తెలియపరచకుండా కిరణ్మయి తమ్ముడికి వైరిచ్చాను. అతను వచ్చాడు. అంతా సాంగోపాంగంగా విని, 'సీ యిష్టం' అన్నాడు అక్కగారితో. కారు నాలుగు వేల రూపాయిలకు బేరంపెట్టి, యింటిమీదవున్న అప్పు తీర్చి వేశాము. కారణం చెప్పకుండా, మూడు నెలల క్రితం వేయిల్లా, కారు 'సి' సర్టిఫికేటూ కిరణ్మయి పేర మార్పాదిట విచ్చి శంకరం. అందువల్ల వ్యవహారం నిశ్చింతగా సాగి పోయింది; లేకపోతే కొద్దిపాటి అవస్థ పడవలసి వచ్చేది.

కిరణ్మయిని సాగనంపుతున్నప్పుడు నాజీవితాని కింక వసంతఋతువు లేదనిపించింది. 42 ఏళ్ళ జీవితమూ ఒక్క సారి వెక్కిరించింది నన్ను. ఏముంది? ఏమి సాధించాను? నాలుగు రాళ్ళు సంపాదించి, కట్టుకున్న భార్యద్వారా సత్సంతానాన్ని బడిసి, రేపో నేడో మనుమల్ని ఎత్తబోతు న్నాను. కిరణ్మయిమీద నా కెంత అనురాగం వున్నదీ. ఆమెని సాగనంపే రోజుదాకా తెలుసుకో లేకపోయాను. అది ధవళమైన అనురాగం. అందులో నీలాకాశంగానీ నెమిలి కంఠం గానీ లేవు. తెలుపు ఏ నిర్మలతని సూచి స్తుందో, ఆ అనురాగ బంధంలో అంతటి స్వచ్ఛందతే ఉంది. నాకు కిరణ్మయి ఎలాటి ఆత్మబంధువో, కిరణ్మ యికి నేనూ అంతే నేమో! ఈనాడు శంకరం పిచ్చి శంకరం అయినప్పటికీ ఒకనాడు అతనూ అలాంటివాడే! అంత గొప్పదైన స్నేహమే మా మధ్య లేనప్పుడు ఈ చెలిమి ఇన్నాళ్ళు నిలిచేదా?

కిరణ్మయి వాళ్ళవాళ్ళింటికి వెళ్ళిపోయింది. ఐనప్పటికీ, నెలకు రెండు నెలలకూ నేను కలుసుకుంటానని మాట యిచ్చాను. పిల్లాడు యింకో మూడేళ్ళకు కాలేజి క్లాసులోకి వస్తాడు; అప్పటికి తను తిరిగి మద్రాస్ వచ్చేస్తా నంది కిరణ్మయి. వచ్చి టీచరు పని చేస్తుందట. అది మూడు సంవత్సరాల తరువాత మాట. ఏమైనా, పిల్లల పూచీ నాదట; లోపలోగా ఏమైనా అయితే, వాళ్ళకు గార్డియన్ నేనే నట.

మహా ప్రణయాలూ, మహా శోకాలూ కాలపురుషుని ముందు యిసుక రేణువులు. రోజులు గిరగిర తిరుగుతున్నాయి. కిరణ్మయి మద్రాసులో లేకపోవడంవల్ల నా జీవితంలో ఒకమాదిరి చీకటి ఏర్పడి ఆరునెల లయింది. ప్రతివారం ఉత్తరం రాస్తూ వుండేది. ఇంకా, నేనే కాస్త అశ్రద్ధ చేసేవాణ్ని జవాబు యివ్వడంలో.

కారులో బెంగుళూరు పోయివస్తున్నాను. చిక్కూరు కొండలప్రాంతాల డ్రయివర్ కారు ఆపుచేశాడు—యింజనులో నుంచి ఏదో శబ్దంవస్తోంది. బానెట్ ఎత్తి పరిశీలిస్తున్నాడు డ్రయివర్. ట్రంక్ రోడ్డుమీదుగా నడిచి పోతున్న కాషాయ వస్త్రధారి మీద నా దృష్టి పడింది. శివశంకరం తప్పిపోయినప్పట్నుంచీ ప్రతి సన్యాసినీ పరీక్షగానే చూస్తున్నాను.

కారు దిగి, అవునా కాదా అని తటాపటాయిస్తూ వుండగా, "జై—సీతారామ్" అంటూ అతను నన్ను పలకరించాడు. పూర్వాశ్రమంలో స్వామివారి నామధేయం శివశంకరమే నట. కారు వెనక్కి పట్టించాను. అతను కారు ఎక్కనన్నాడు. భగవంతుణ్ని తిట్టుకుంటూ, శివశంకరం వెంట నేనూ నడిచాను.

పశువుల కాపరులు ఉండే చిన్నగూడెం వద్దకు తీసుకు వెళ్ళాడు నన్ను. అక్కడ వున్నవన్నీ కలిపి యిరవై గుడిసెలు ఉండవు. అందులో ఒకటి స్వాములవారిది. స్వామివారిమీద అక్కడ వున్న యాభై అరవై మందికీ అమితమైన భక్తి.

"ఇదంతా బాగానే ఉంది. నువ్వు ఎందుకు సంసారాన్ని త్యజించినట్టు ?"

"జై—సీతారామ్"

"ఆత్మలో వెలిగే చిద్విభూతి యిక్కడగాని కని పించదా ?"

"జై—సీతారామ్."

"నేను లేస్తాను. సాయంత్రం క్లబ్బులో పార్టీ ఉంది. నేను వేళకి ఉండకపోతే బావుండదు."

"సంసారాన్ని ఎందుకు త్యజించానని అడుగుతున్నావు కదూ ?" అని ప్రశ్నించాడు శివశంకరం.

"అవును. చెప్పదలచుకుంటే చెప్పు, లేకపోతే మానేయ్."

"సుశీల ఎవరి పోలికో పరిశీలనగా చూశావా ?" సుశీల వారి రెండో సంతానం.

"ఏం—ఎవరి పోలిక ?" అని ఆదుర్దాగా అడిగాను. పారేసుకున్న తాళం చెవులగుత్తి దొరుకుతున్నట్టుంది.

"దానిలో నా పోలికలు లేవు."

"ఎవరి పోలికలు వున్నాయి ?" నా వెన్ను జలదరిస్తోంది.

"జై—సీతారామ్."

"ఎవరి పోలికలు వున్నాయి ?" అదేదో వింటేగాని ప్రాణం వుండబట్టదు.

"మా మేడమీద అద్దెకున్న........"

ఆపైన వినలేదు. కిరణ్మయి గురించి వాదించ తలుచుకో లేదు. ఈ అనుమానపిశాచం గురించి ఆమె కసలు తెలు

సునో తెలియదో ! తెలిసివుంటే, నాతో చెప్పడానికి కూడా సంశయించేదా ? ఏమైనా నేను తెలుసుకోవలసిందేమీ లేదు యింక. "జై—సీతారామ్" దగ్గర సెలవుతీసుకుని బయలుదేరాను.

చిత్తూరు దగ్గర కారెక్కినప్పట్నుంచీ ఆలోచనలతో తల దిమ్మెక్కిపోయింది. శివశంకరం ఫలానా చోట ఉన్నాడని కిరణ్మయికి తెలియబరచనా ? ఆమె తక్షణం యిక్కడికి వచ్చి అతని అనుమానాన్ని పోగొట్టేందుకు ప్రయత్నం చేస్తుందేమో ! కాని అతని అనుమానం తీరేదా ? ఎన్నేళ్ళబట్టీ పాతుకుపోయి వుందో ? అయితే, అలాంటి అనుమానం నామీద ఎందుకు లేకుండా ఉండాలి ? పోలికల్ని బట్టి ఈ అనుమాన బీజం మొలకెత్తిందా ? కిరణ్మయికి మాలిన్యాన్ని అంటగట్టే శివశంకరం ఆత్మక్షోభతో పరివర్తన పొందవలసిందేగాని, ఆమెను వెళ్ళి అతని పాదాల మీద పడమనగూడదు. నిజం—కాని అతను భర్త, ఆమె భార్య. ఈ సమస్య వారిద్దరిదీను. మధ్యని నేనెవరు ? ఇంటికి రాగానే కాగితం కలం పుచ్చుకు కిరణ్మయికి సంగతంతా గబగబా రాసేశాను. కాని, ఉత్తరం చించేసి కాస్మాపాలిటన్ క్లబ్బు పార్టీకి వెళ్ళిపోయాను.

ఈ సంగతి కిరణ్మయికి నాకు నేనుగా చెప్పేందుకు నాటికీ నోరు రాదు.